సాక్షి
సిద్దిపేట
7

గురువారం । 31 । అక్టోబర్ । 2024

వెలుగుల పండుగకు వేళాయె..


సిద్దిపేట మార్కెట్‌లో పూల కొనుగోళ్ల సందడి

నేడే దీపావళి.. సర్వం సిద్ధం
- పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లన్నీ కిటకిట

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వెలుగుల పండుగ సందడి మొదలైంది. పల్లెలు, పట్టణాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. చీకటిని పారదోలుతూ వెలుగులు నింపే పండుగ దీపావళి. లక్ష్మీపూజలు, నోములు, వ్రతాలు ఆచరించేందుకు ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సముదాయాలను సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల్లో నివసించే వారు పిల్లలతో కలిసి స్వగ్రామాలకు చేరుకున్నారు. మరోవైపు పూలు, ప్రమిదలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. బాణసంచా కొనుగోళ్లు


బాణసంచా కొనుగోళ్లు..

సైతం జోరుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు, మార్కెట్లలో పూలు, ప్రమిదల కొనుగోళ్లతో సందడిగా మారాయి. అలాగే అనేక పాఠశాలల్లో ముందస్తు దీపావళి ఉత్సవాలను నిర్వహించారు.

తీరొక్క ప్రమిదలు..

దీపావళి అంటేనే ప్రమిదలు గుర్తుకొస్తాయి. వివిధ ఆకృతులతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వినాయక, లక్ష్మి, తులసీకోట తదితర ఆకారంలో విక్రయిస్తున్నారు. గృహాలలో, వ్యాపార సముదాయాలల్లో లక్ష్మీపూజలకు భారీగా పూలు కొనుగోళ్లు చేస్తుంటారు. దీంతో పూలధరలు అమాంతంగా పెరిగాయి. బంతి, చామంతి, గులాబీ, మాల్లెపూలు మొదలగు వాటి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. బంతి పూలు కిలోకు రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. వీటితో పాటుగా చామంతి పూలు కిలోకు రూ.150 నుంచి 200 వరకు విక్రయించారు.


ప్రమిదలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

న్యూస్‌రీల్

మున్సిపల్ ముద్ర తప్పనిసరి
కమిషనర్ ఆశ్రిత్ కుమార్


మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: మున్సిపల్ ఆమోదిత ముద్ర ఉన్న మాంసాన్నే విక్రయించాలని కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో పట్టణ మాంస విక్రేతలు, శానిటరీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన మాంసం అందించే బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. అనారోగ్యంతో ఉన్న జీవాల్ని వధించి విక్రయాలు చేయొద్దని సూచించారు. ఇరుకోడ్ శివారులో వ్యాపారుల కోసం రెండు ఎకరాల స్థలంలో స్లాటర్ హౌస్ నిర్మించామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్లాటర్ హౌస్‌లోనే జీవాలను వధించాలన్నారు. ఆరు బయట, సొంతంగా విక్రయించే వారిపై నిఘా ఉంటుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్, వనిత, మాంస విక్రేతలు పాల్గొన్నారు.

హామీల అమల్లో సర్కార్ విఫలం
ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వంటేరు

గజ్వేల్: హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తిరుగుబాటు మొదలయ్యిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. దేశ చరిత్రలో ఎప్పుడూలేని విధంగా పోలీసులే రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. మూసీ నిర్వాసితుల ఆందోళనలు, నిరుద్యోగ యువత ధర్నాలతో రాష్ట్రం దద్దరిల్లుతోందని వాపోయారు. రేవంత్ తానూ ఇచ్చిన హామీలను గాలికొదిలేయడం వల్ల నేడు ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలను చేయడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను ఎదుర్కొనే ధైర్యం లేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలపై ప్రజలను చైతన్య వంతుల్ని చేస్తామని అన్నారు. ప్రజామద్దతుతోనే కాంగ్రెస్ నేతలకు తగువిధంగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటరూరల్: సదరం శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. నవంబర్ 7, 21వ తేదీల్లో మానసిక, కంటిచూపు లోపం ఉన్న వారికి, నవంబర్ 14, 28న ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, నవంబర్ 21న చెవుడు, మూగ వారికి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి హాజరు కావాల్సిన దివ్యాంగులు మీసేవ కేంద్రాల్లో స్లాటు బుక్ చేసుకుని వారికి కేటాయించిన తేదీలలో హాజరు కావాలని సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


ఓటరు నమోదులో పాల్గొన్న ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ఉపాధ్యాయ, అధ్యాపకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు కేజీబీవీ పాఠశాలలను సందర్శించి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు చివరి తేదీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్, విద్యాసాగర్, శ్యాంసుందర్, శ్రీధర్, మధు, కుమారస్వామి, శ్రావణి, శృతి, మహేందర్‌రెడ్డి, నవనీత, సుజాత, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేత

తొగుట(దుబ్బాక): గుడికందుల జెడ్పీ ఉన్నత పాఠశాలకు పెద్ద మాసాన్‌పల్లికి చెందిన పారిశ్రామికవేత్త పన్యాల ప్రవీణ్‌రెడ్డి బుధవారం కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యనేర్చిన పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశానన్నారు.

వైద్య సేవలు విస్తృతం

హుస్నాబాద్ ఆస్పత్రికి మహర్దశ
- 250 పడకలుగా అప్‌గ్రేడ్
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- ఇక నుంచి మల్టీ స్పెషాలిటీ సేవలు

హుస్నాబాద్: వైద్య సేవలు.. ఆధునికం, మరింత విస్తృతం కానున్నాయి. అందుబాటులోకి మల్టీ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వెరసి హుస్నాబాద్ ఆస్పత్రికి మహర్దశ పట్టనుంది. వంద పడకల నుంచి 250 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రూ.82 కోట్లు విడుదల చేసింది. హుస్నాబాద్ పట్టణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 30 పడకల ఆస్పత్రిని అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వర్ రావు ప్రారంభించారు. తరువాత మరో 20 పడకలు పెంచారు. రోగుల సంఖ్య పెరగడంతో ప్రత్యేక రాష్ట్రంలో ఈ ఆస్పత్రిని మే 30, 2017లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. లక్ష్మారెడ్డి రూ.3కోట్ల వ్యయంతో 50 పడకల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించారు. మొత్తం 100 పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకుంది. 100 పడకల ఆస్పత్రిగా ఉన్నప్పటికి 50 పడకలకు తగ్గట్లే వైద్యులు, సిబ్బంది, సదుపాయాలు ఉన్నాయి.

8 మంది వైద్యులు..

ప్రస్తుతం ఆస్పత్రికి రోజూ 400 మందికి పైగా వివిధ చికిత్స కోసం రోగులు వస్తున్నారు. అలాగే ప్రసవాల సంఖ్య సైతం పెరుగుతోంది. కిడ్నీ రోగులకు డయాలసిస్, మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా సాగుతున్నాయి మొత్తంగా 8 మంది డాక్టర్లు షిఫ్ట్‌ల వారీగా వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆధునిక సేవలు ...

ఈ ప్రాంత ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందబాటులోకి రానున్నాయి. పిల్లల వైద్య నిపుణులు, డెంటల్, గైనిక్, కంటి వైద్య నిపుణుడు, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్, ఫోరెనిక్స్, అనస్తీయా, మెడికల్ ఆఫీసర్, జనరల్ మెడికల్ ఆఫీసర్లు ఉంటారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌తో పాటుగా మరికొంత మంది సహాయకులుగా విధులు నిర్వహిస్తారు. అలాగే 4 నుంచి 5 ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు కనీసం ఆరుగురు వైద్య నిపుణులు వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది.


హుస్నాబాద్ ఆస్పత్రిలో రోగులకు సేవలు..

వైద్య కళాశాలకు బాటలు..

హుస్నాబాద్‌లో వైద్య కళాశాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ వైద్య కళాశాల నిర్మాణం కోసం జిల్లెల్లగడ్డ, అక్కన్నపేట మండలంలోని చౌటపల్లిలో స్థల పరిశీలన చేశారు. అయితే వైద్య కళాశాల ఏర్పాటు కావాలంటే స్థానికంగా 250 పడకల ఆస్పత్రి ఉండాలనే నిబంధన ఉంది. మంత్రి చొరవతో హుస్నాబాద్ పట్టణంలో ఉన్న 100 పడకల ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ, రూ.82 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో వైద్య కళాశాలకు బాటలు వేసినట్లవుతోంది.


హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

కార్పొరేట్ స్థాయిలో సేవలు



హుస్నాబాద్ నియోజకవర్గం ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం. 250 పడకల ఆస్పత్రిలో అన్ని రకాల సదుపాయాలు, శస్త్ర చికిత్సలతో పాటు ప్రతి విభాగానికి స్పెషలిస్ట్ అందుబాటులో ఉంటారు. పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే స్థానికంగానే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తాం. నియోజకవర్గాన్ని వైద్యం, విద్య, వ్యవసాయం, సాగు, తాగునీరు, పారిశ్రామికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- మంత్రి పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఆస్పత్రిని అప్‌గ్రేడ్‌తోపాటు నిధులు విడుదల చేసినందుకు స్థానిక ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. బుధవారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చుతూ, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి పొన్నం చొరవతో ఆస్పత్రిని 250 పడకలుగా అప్‌గ్రేడ్ చేయడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ,వల్లపు రాజు, సరోజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

రహదారి భద్రతే జీవితానికి రక్షణ
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, చిత్రంలో సీపీ అనురాధ తదితరులు

సిద్దిపేటరూరల్: రహదారి భద్రతతోనే జీవితానికి రక్షణ అని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సీపీ అనురాధ, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. రహదారి భద్రతపై తగు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రకాల రహదారులలో ఎలాంటి వాహన ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖతో కలిసి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు జాతీయ, ఇతర ప్రధాన రహదారులను కలిపే ప్రాంతాలను పరిశీలించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల వద్ద సూచికల బోర్డులను ఏర్పాటు చేసి, గుంతలను పూడ్చాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన మొక్కల కొమ్మలను కత్తిరించి తొలగించాలన్నారు. దుద్దెడ, కుకునూరుపల్లి, గౌరారం, వంటిమామిడి గ్రామాల వద్ద ప్రమాదాలకు గురి కాకుండా రెయిలింగ్ సీడ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనల మేరకే రహదారుల నుంచి నిర్దేశిత దూరం పాటించి వైన్ షాప్‌లు ఉండేలా చూడాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి..

పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ ప్రయాణికులు వాహనదారులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. దీంతో ప్రమాదాలను నివారించవచ్చన్నారు. పోలీస్ శాఖ వారు సూచించే నియమ నిబంధనలను డ్రైవర్లు తప్పక పాటించాలన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలి

మాదకద్రవ్యాల నియంత్రణపై సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. అన్ని పాఠశాలలో యాంటీ డ్రగ్ కమిటీలు విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన చర్యలు చేపట్టాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పలితాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట సబ్ జైల్లో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మూర్తి, జిల్లా రవాణా శాఖ అధికారి కొండల్‌రావు, ఏసీపీలు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దించుకోవడంలో ఆలస్యం తగదు
రైస్‌మిల్లర్లతో కలెక్టర్ సమీక్ష

సిద్దిపేటరూరల్: కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వద్దకు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే దించుకోవాలని కలెక్టర్ మనుచౌదరి రైస్‌మిల్లర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైస్ మిల్లర్లు వారి మిల్లు సామర్థ్యం అనుసరించి వరిధాన్యం కేటాయిస్తామన్నారు. అదేవిధంగా ఎవరైతే గడువు లోపల సీఎంఆర్ డెలివరీ పూర్తి చేస్తారో వారికి ప్రభుత్వం దొడ్డుబియ్యం క్వింటాలకు రూ.30 చొప్పున అదనంగా, సన్న బియ్యానికి రూ.40 చొప్పున మిల్లింగ్ చార్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, జిల్లా మేనేజర్ బి.ప్రవీన్, మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

కేసీఆర్ పేరును చెరిపివేయలేరు..

గజ్వేల్: స్వరాష్ట్రం కలను సాకారం చేసిన కేసీఆర్ పేరును చరిత్ర నుంచి చెరిపివేయడం ఎవరితరం కాదని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ ఉద్యమ సమయంలో ఎన్నోసార్లు పదవులను తృణప్రాయంగా వదులుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమేకాకుండా రాష్ట్రం అన్ని రంగాల్లో నిలదొక్కుకోవడానికి బలమైన పునాది వేశారని కొనియాడారు. ప్రజల గుండెల్లో కేసీఆర్ ఆకాశం అంత ఎత్తులో ఉంటే రేవంత్‌రెడ్డి మాత్రం ఉద్యమకారుల మీదనే రైఫిల్‌ను ఎక్కుపెట్టి..ద్రోహిగా మిగిలిపోయారని చెప్పారు. రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లు ఎంతమంది ప్రయత్నించినా కేసీఆర్ ఆనవాళ్లను, పేరును తెలంగాణ చరిత్ర నుంచి చెరిపివేయలేరని అన్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ ప్రజలకు ప్రాణమనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలన్నారు.


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్‌కు గోల్డ్ మెడల్

హుస్నాబాద్: సిద్దిపేట ప్రభుత్వ పాఠశాల మైదానంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. 17 ఏళ్ల బాలుర కబడ్డీ విభాగంలో హుస్నాబాద్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. దుబ్బాక, హుస్నాబాద్ జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో హుస్నాబాద్ జట్టు చాంపియన్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. డీఈఓ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సౌందర్య, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, పీడీలు పాల్గొన్నారు.


హుస్నాబాద్ జట్టును అభినందిస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

రిజర్వేషన్లు పెంచాల్సిందే..
- దామాషా ప్రకారం కల్పించాలి
- బీసీ సంఘాల నేతల డిమాండ్
- బీసీ కమిషన్‌కు వెల్లువెత్తిన వినతులు
- ప్రభుత్వానికి నివేదిస్తానన్న చైర్మన్ నిరంజన్
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ

సంగారెడ్డి జోన్: స్థానిక ఎన్నికల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని వివిధ బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కమిషన్ చైర్మన్ నిరంజన్ అధ్యక్షతన బహిరంగ విచారణ చేపట్టారు. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్, కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లాల బీసీ సంఘాల నేతల నుంచి వినతులు స్వీకరించి, వారి అభిప్రాయాలను సేకరించారు. మొత్తం 92 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వేలో సమగ్ర సమాచారం అందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన నివేదికలు డిసెంబర్ 9వ తేదీలోగా ప్రభుత్వంతోపాటు హైకోర్టుకు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


బీసీ కమిషన్‌కు వినతిపత్రం అందిస్తున్న వీరశైవ లింగాయత్ సమాజ్ లింగ బలిజ

లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలి. 2009 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం జీఓ నం.16, సీరియల్ నం .46లో బీసీ-డీలో కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. 40 లక్షలు ఉన్న జనాభాను దృష్టిలో ఉంచుకొని లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.1000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలి. బీసీ-డీలో కలుపుతూ జీఓ జారీ చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యారంగపరంగా ఎలాంటి అవకాశాలు లభించడం లేదు.

-వీరశైవ లింగాయత్, లింగ బలిజ కమిటీ సభ్యులు

గంగపుత్రుల సమస్యలు పరిష్కరించాలి

గంగపుత్రుల జీవనోపాధిలో భాగంగా ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించాలి. చెరువులు, కుంటలు, కబ్జాలకు గురి కావడంతో జీవనోపాధికి కష్టతరంగా మారింది. బీసీ-ఏలో ఉంటూ చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సరైన విధంగా ఇళ్ల లేకపోవడం, నిర్మించుకునేందుకు ఇళ్ల స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. **- గంగపుత్రుల కమిటీ సభ్యులు**

బీసీ-ఏ జాబితాలో చేర్చాలి

బీసీ-డీ జాబితాలో ఉన్న ముదిరాజులను బీసీ-ఏ జాబితాలో చేర్చాలి. బీసీ-డీలో ఉండటంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో వెనుకబడి ఉన్నాం. చదువుకునేందుకు ఆర్థిక స్థోమత లేక పోవడంతో చదువు మధ్యలోనే ఆపేసి చిన్నపాటి పనులు చేసుకుంటున్నాం. జనాభా దామాషా ప్రకారం ప్రత్యేక నిధులు కేటాయించాలి.

- ముదిరాజ్ సంఘం సమితి సభ్యులు

సమగ్ర జనాభా గణన చేయాలి

రాష్ట్రంలో సమగ్ర పూర్తి జనాభా గణన చేపట్టాలి. విశ్వబ్రాహ్మణులు జనాభా దామాషా ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలి. జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో రాణించేందుకు ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

-విశ్వబ్రాహ్మణుల కమిటీ సభ్యులు

క్లుప్తంగా

ఈతకెళ్లి యువకుడి మృతి


సునీల్‌కుమార్

పెద్దశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు ఈతకెళ్లి యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కమలాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ.విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన నాందేడ్ సునీల్‌కుమార్(30) అతడి స్నేహితుడు చంద్రశేఖర్‌లు కలిసి చెరువు వద్ద కూర్చొని మద్యం తాగారు. అనంతరం గోపాలచెరువు చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు సునీల్‌కుమార్ మునిగిపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో వెలికితీశారు. మృతుడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

గజ్వేల్‌రూరల్: ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికను నవంబర్ 2న నిర్వహిస్తున్నట్లు పీడీ విజయరేఖ తెలిపారు. బుధవారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల జెడ్పీ బాలుర పాఠశాలలో అండర్19 బాలుర, బాలికల విభాగంలో, అండర్ 14, అండర్17 బాలుర, బాలికల విభాగంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్, ఒరిజినల్ బోనోఫైడ్‌తో ఎంపిక కార్యక్రమానికి రావాలని సూచించారు.

4న సాఫ్ట్‌బాల్ పోటీలకు....

అండర్19 బాలుర, బాలికల విభాగంలో సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో నవంబర్ 4న జరిగే ఎంపిక కార్యక్రమానికి క్రీడాకారులు ఆధార్ కార్డు, బోనోఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతులలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువు నవంబర్ 9 వరకు పొడిగించినట్లు నవోదయ ప్రిన్సిపాల్ డి. రాజేందర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇద్దరు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పుట్టింటికి పంపేందుకు భార్యను బస్టాండ్‌కు తీసుకుని వస్తే ఇక్కడి నుంచి భార్య అదృశ్యమైందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరులోని ఓ కాలనీలో భార్యాభర్తలు ఉంటున్నారు. ఆమె అనారోగ్యంతో ఉండటంతో పుట్టింటికి పంపుదామని పటాన్‌చెరు ప్రయాణ ప్రాంగణానికి తీసుకువచ్చాడు. మందుల చిట్టీ మరిచిపోవడంతో తీసుకు వస్తానని చెప్పి ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఆమె ఇక్కడ కన్పించలేదు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో పటాన్‌చెరు స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి..

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వెట్ సింగ్ అనే వ్యక్తి ఈనెల 17న కూలి పని చేసేందుకు పటాన్‌చెరు మండలం రుద్రారానికి వచ్చాడు. అతనికి బంధువుల వద్ద ఉంటున్నాడు. ఈనెల 19న సాయంత్రం ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన వారిని విచారించినా గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో పీఎస్‌లో అతని బంధువులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కొలువుల భాండాగారం

- పోటీ పరీక్షల అభ్యర్థులకు బాసటగా గ్రంథాలయం
- ఇటీవల డీఎస్సీలో 13 మందికి ఉద్యోగాలు
- అందులో ఇద్దరు జిల్లా టాపర్లు

ఖేడ్ గ్రంథాలయం .. పోటీ పరీక్షలు, ప్రభుత్వ కొలువులు సాధించేందుకు దోహదం చేస్తోంది. ఇక్కడే పోటీ పరీక్షలకు సన్నద్ధమైన అభ్యర్థులు ఉద్యోగాలను సాధిస్తున్నారు. ఇటీవల డీఎస్సీ ఫలితాలు విడుదల కాగా 13 మంది కొలువులు పట్టారు. అందులో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లుగా జిల్లా టాప్ ర్యాంకులను పొందారు. మరెంతోమంది ఇక్కడే ప్రిపేర్ అవుతున్నారు. 1966లో పురాతన అద్దెభవనంలో ప్రారంభమైన గ్రంథాలయం కాలానుగుణంగా 19 సెప్టెంబర్ 2023లో నూతన భవనం నిర్మాణానికి నోచుకుంది. గ్రంథాలయంలో సకల హంగులు కల్పించారు. అభ్యర్థులు కూడా ఇక్కడే వచ్చి సన్నద్ధమయ్యేందుకు సుముఖతను చూపుతున్నారు.


సిద్ధమవుతున్న అభ్యర్థులు

నారాయణఖేడ్: గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించినా పాఠకులకు సమస్యలు వదల్లేదు. స్థానికంగా కోచింగ్ కేంద్రాలు లేకపోవడంతో నిరుద్యోగ అభ్యర్థులు, విద్యార్థులకు గ్రంథాలయమే ప్రధాన కేంద్రంగా మారింది. సరైన పుస్తకాలు, ఫర్నిచర్, సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిని కలిసి గోడు వినిపిస్తే వెంటనే స్పందించారు. 60 చైర్లు, 7 టేబుళ్లు, వాటర్ ప్యూరీఫై, సర్వోదయ ఫౌండేషన్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమయ్యే 147 పుస్తకాలు, కంప్యూటర్, వైఫై సదుపాయాలను కల్పించారు. అనంతరం వేసవిలో ఉక్కపోతతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను సైతం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళితే రూ.1 లక్ష వరకు వెచ్చించి రెండు ఏసీలను ఏర్పాటు చేయించారు. గ్రంథాలయం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకే తెరుస్తారు. కానీ ప్రత్యేకంగా అటెండర్‌ను ఏర్పాటు చేయించి ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు లైబ్రేరీని నిర్వహించారు. దీంతో డీఎస్సీతో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఎంతో సౌకర్యవంతం అయ్యింది.


గ్రంథాలయంలోని పుస్తకాలు

వారు ఉపాధ్యాయులుగా..

లైబ్రేరీలో ప్రిపేర్ అయిన 13 మంది డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్లు)గా కె.రమ, భాస్కర్, వి.వినోద్, పూజ, ఉమారాణి, ఎస్.రాజేశ్వరి, ఎ.స్వాతి, కమ్మరి శ్రీజ, సీహెచ్ మౌనిక, స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)గా ఎం.యోగేశ్వర్, పి.రవి, సీహెచ్ సవిత, కె.కాశీనాథ్‌లు ఎంపికయ్యారు. ఇందులో ఇద్దరు ఎం.యోగేశ్వర్ సోషల్ విభాగంలో, కె.కాశీనాథ్ తెలుగు విభాగంలో స్కూల్ అసిస్టెంట్లుగా జిల్లా టాపర్లుగా నిలిచారు. గ్రంథాలయం నుంచి 13 మంది ఉపాధ్యాయులు కావడం పట్ల లైబ్రేరియన్ లలితాబాయి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రంథాలయాన్నే నమ్ముకున్నా



బొక్కస్‌గాం గ్రామ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన నేను ప్రత్యేకంగా కోచింగ్ తీసుకునే పరిస్థితి లేదు. ఖేడ్‌లో ఓ చిన్న గది అద్దెకు తీసుకొని గ్రంథాలయాన్నే నమ్ముకొని ప్రిపేర్ అయ్యా. 80.93 మార్కులతో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించా.

– కె.యోగేశ్వర్, స్కూల్ అసిస్టెంట్ (సోషల్), జిల్లా టాపర్

మిత్రుడి సూచనలతో..



జగన్నాథ్‌పూర్‌కు చెందిన నేను ఇంటివద్దే ప్రిపరేషన్ మొదలు పెట్టినా సరిగా ప్రిపరేషన్ జరిగేది కాదు. దీంతో చాలా బాధపడ్డా. ఖేడ్‌లో గ్రంథాలయంలో అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారని మిత్రుడు సమాచారం ఇచ్చాడు. దీంతో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో 75.13 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సాధించాను.

– ఎం.కాశీనాథ్, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), జిల్లా టాపర్

బంతి సాగు.. ఆదాయం బాగు

సరైన సమయంలో పంట వేస్తే మంచి లాభాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ యేటా సాగు చేసే వరి, పత్తి పంటలతో అంతంతమాత్రంగా లాభాలు పొందిన ఓ రైతు వినూత్నంగా ఆలోచించి బంతి పూల సాగు వైపు మొగ్గు చూపాడు. సరైన సీజన్‌లో పూల సాగు చేపట్టి మంచి లాభాలు గడిస్తున్నాడు. అతనే చిలప్‌చెడ్ మండలం రహీంగూడకు చెందిన రైతు జరప్ల సుదర్శన్. తనకున్న ఐదెకరాలలో వరి, కూరగాయలు, ఆకుకూరలతోపాటు ఎకరాలో బంతి సాగు చేపట్టాడు. ఆగస్టు ప్రారంభంలో ప్రారంభించడంతో బతుకమ్మ, దసరా సీజన్‌లో మొదటి దశ పూలు చేతికరాగా మంచి లాభాలు గడించాడు. ప్రస్తుతం రెండోసారి కోతకు రావడంతో దీపావళి సీజన్ సైతం బాగానే ఉండనుంది. మరో రెండు సార్లు కూడా పూలు కోతకు వస్తాయి. సాగు ఎకరానికి రూ. 50 వేల వరకు రైతు పెట్టుబడి పెట్టాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామం నుంచి బంతి నారు తెప్పించాడు. ఒక్కో మొక్కకు రూ.5లు ఖర్చు అయ్యింది. బతుకమ్మ సీజన్లో బంతిపూలు అమ్మగా రూ. 60 వేల వరకు ఆదాయం చేకూరింది. మరోమారు చేతికి రాబోతుండటంతో దీపావళి సీజన్‌లో మరో రూ. 60 వేల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతు చెబుతున్నాడు. ముఖ్యంగా సాగులో చీడపీడలు మినహా ఎక్కువ సమస్యలు ఉండవు. సరైనా పద్ధతిలో, సరైన సీజన్‌లో సాగు చేస్తే అధిక లాభాలు పొందొచ్చు. పెద్ద మొత్తంలో సాగు చేస్తే వరి కంటే ఈ సాగే లాభదాయకం. పైగా పంట మార్పిడితో నేల సైతం సారవంతమవుతుంది. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అని పేర్కొన్నాడు.

వాతావరణం అనుకూలిస్తే చాలు



ఆగస్టు ప్రారంభంలో బంతి సాగు ప్రారంభించాను. సరైన పండుగల సీజన్లో బంతిపూలు చేతికందడంతో మంచి లాభాలు సాధించాను. మరోమారు పూలు కోతకొచ్చాయి. దీపావళికి కూడా అంతే ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాను. వాతావరణం అనుకూలిస్తే ఈ సాగుకు మించిది ఏదీ లేదు.

– సుదర్శన్, రైతు రహీంగూడ


రహీంగూడలో సాగైన బంతి తోట

ఎస్‌ఐ అంటూ బెదిరింపు

శివ్వంపేట(నర్సాపూర్): ఎస్సైనంటూ సస్పెండెడ్ హోంగార్డు బెదిరింపులకు పాల్పడిన సంఘటన మండలంలోని గుండ్లపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లింగపల్లి రాజుకు సంబంధించిన పాట్టు లారీ రోడ్డు పక్కకు పార్క్ చేస్తే నర్సాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి కారు సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ వద్ద ఢీకొందని తెలిసింది. ఈ విషయమై వడ్ల వెంకటేశ్ (సస్పెండెడ్ హోంగార్డు) తాను ఎస్‌ఐ అంటూ గుండ్లపల్లిలో నివాసముండే రాజు ఇంటికెళ్లి లారీ వల్ల కారు పాడైపోయిందని, 53 వేల రూపాయలు రిపేర్‌కు ఖర్చు అయిందని, నకిలీ బిల్లు తీసుకొచ్చి డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ తర్వాత తన ప్రమేయం లేకపోయినా ఇంటి వద్దకు వచ్చి ఎస్‌ఐ అంటూ బెదిరింపునకు పాల్పడి, దూషించిన వెంకటేశ్‌తో పాటు మరో వ్యక్తి విజయ్‌పై స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు లింగంపల్లి రాజు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్ జిల్లా పోటీలకు క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న గురుకులం ప్రిన్సిపాల్ తదితరులు

నర్సాపూర్: అంతర్ జిల్లా పోటీలకు తమ పాఠశాల నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని స్థానిక అల్లూరి సీతరామరాజు గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు. ఇటీవల పాపన్నపేటలో జరిగిన జిల్లా పోటీలలో 14 కేటగిరిలో తమ పాఠశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. జిల్లా జట్టులో ఆడిన క్రీడాకారులలో ఇద్దరు క్రీడాకారులు నవంబరు ఒకటి నుంచి సిద్దిపేటలో జరిగే అంతర్ జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్, పీడీ లక్ష్మణ్, పీఈటీలు లింగం, రాజు అభినందించారు.

చిన్నమ్మ ఆఖరి చూపులకు వచ్చి వెళ్తుండగా..


సవిత మృతదేహం

- లారీని ఢీకొన్న బైక్
- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని 161 జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పెద్దగరారం గ్రామస్తుడు అంజయ్య, అతని భార్య సవితలు హైదరాబాద్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. మూడు రోజుల క్రితం అంజయ్య చిన్నమ్మ మృతిచెందడంతో స్వగ్రామానికి వచ్చారు. తిరిగి హైదరాబాద్‌కు అన్న కొడుకు చరణ్‌తో కలిసి వారిద్దరు బైక్‌పై బయలుదేరారు. అల్లాదుర్గం శివారుకు రాగానే లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా వెనుక నుంచి వేగంగా బైక్‌తో వచ్చి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో సవిత (35) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ అంజయ్య, చరణ్‌లను చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంజయ్య పెద్దనాన్న బోజయ్య ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఇనుప మెట్లను ఢీకొన్న బైక్ ఒకరి మృతి


ప్రమాదం స్థలం

పెద్దశంకరంపేట(మెదక్): బైక్.. ఇనుప మెట్లను ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మల్కాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. రేగోడ్ మండలం పెద్దతండాకు చెందిన మెగావత్ రమేశ్(45), బాచేపల్లి తండాకు చెందిన సురేశ్‌లు పెద్దశంకరంపేట నుంచి రేగోడ్ వైపునకు వస్తున్నారు. మల్కాపూర్ స్టేజీ మలుపు వద్ద బైక్ అదుపు తప్పి అంబేడ్కర్ బొమ్మ మెట్లను ఢీకొట్టింది. దీంతో రమేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, సురేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన అతడిని మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి ఆస్పత్రికి తరలించారు. రమేశ్ భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విఠల్ తెలిపారు.

ట్రాలీ ఆటో బోల్తా పలువురికి గాయాలు


108 వాహనంలో గాయపడిన కూలీలు

మిరుదొడ్డి(దుబ్బాక): కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నారాయణరావు పేట మండల కేంద్రానికి చెందిన సుమారు 22 మంది కూలీలు అల్వాలలోని ఓ రైతు పత్తి చేనులో పని చేసేందుకు ట్రాలీ ఆటోలో బయలు దేరారు. గ్రామ శివారులో ఉన్న మర్రి మాను సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి ఆటో బోల్తా కొట్టింది. దీంతో 8 మంది మహిళా కూలీలకు స్వల్ప గాయాలు కాగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 వాహనం ద్వారా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన వారిలో ఒకరి పరిస్థితి మాత్రం విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పోక్సో కేసులో ఇద్దరికి రిమాండ్

పటాన్‌చెరు టౌన్: పోక్సో కేసులో ఇద్దరిని రిమాండ్ తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... కొండకల్ కు చెందిన నర్సింహులు ఇదే గ్రామానికి చెందిన బాలికను వివాహం చేసుకుని పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండలో 10 నెలల నుంచి నివాసం ఉంటున్నాడు. బాలికను ఒంటరిగా వదిలిపెట్టి అయ్యప్ప స్వామి మాల వేసుకుని ఈనెల 19న శబరిమలకు బయలు దేరాడు. బాలిక మతిస్థిమితం లేక రహదారిపైకి రావడంతో స్థానికులు సమాచారంతో పోలీసులు నర్సింహులును వెనక్కి పిలిపించి విచారించారు. మైనర్‌ను పెళ్లి చేసుకున్నందుకు అతనిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే నర్సింహులు లేని సమయంలో బాలికతో ఉంటున్న ఒడిశాకు చెందిన సూర్యను కూడా అరెస్ట్ చేసి ఇద్దరిని రిమాండ్‌కు బుధవారం రాత్రి తరలించారు.

దీపావళి జాగ్రత్తలతో ఆనందాలకేళి



- స్వీయ రక్షణతోనే ప్రమాదాలకు తావుండదు
- చిన్నారులను తల్లిదండ్రులు పర్యవేక్షించాల్సిందే
- పండుగ సందర్భంగా వైద్యుల సూచనలు



సంగారెడ్డి టౌన్ : దీపావళి పండుగలో పెద్దల కంటే పిల్లల సందడే ఎక్కువ. టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటిద్దాం. పండుగను సంతోషంగా జరుపుకుందాం అంటూ వైద్యులు సూచిస్తున్నారు. పటాకులు కాల్చే సమయంలో చిన్నారులు జాగ్రత్తగా ఉండాలి. అజాగ్రత్తగా ఉన్నట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చిన్నపాటి కారణాల వల్ల ప్రతీ సంవత్సరం అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంతో మంది చూపు కూడా కోల్పోయిన సందర్భాలున్నాయి అని మననం చేస్తున్నారు. ఎక్కువగా చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రుల పర్యవేక్షించాలి. అందుబాటులో ఉండి తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. దీపావళి వేడుకలను ఆనందమయంగా జరుపుకోవాలి అని సూచిస్తున్నారు.

జాగ్రత్తలివే..

- ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే మంటలను అదుపు చేసేందుకు బకెట్‌లతో నిండుగా నీళ్లు పక్కన పెట్టుకోండి.
- నిప్పు రవ్వలు దుస్తులపై పడితే అవి త్వరగా వ్యాపించకుండా ఉండేందుకు పిల్లలతో పాటు పెద్దలు కూడా కాటన్ దుస్తులనే ధరించడం మంచిది.
- ధరించిన దుస్తులపై పడిన నిప్పురవ్వలు మరింత రాజుకొని మంటలు వ్యాపిస్తే వెంటనే ఒంటిపై దుప్పట్లు లేదా రగ్గులను కప్పి మంటలను నిరోధించవచ్చు. దుప్పట్లు కప్పడం వల్ల నిప్పుకు ఆక్సిజన్ అందక పైకి వ్యాపించదు.
- ఒక వేళ మీ ఇంటి పక్కనున్న ఏ గుడిసె పైనో నిప్పులు పడి ప్రమాదం పెద్దదయ్యే సూచనలు కనబడితే తక్షణం ఫైర్ సర్వీసెస్‌కు ఫోను చేసేందుకు నంబరు గుర్తుపెట్టుకోండి.
- నిప్పురవ్వలు పడి చిన్నచిన్న గాయాలు ఏర్పడినా సెప్టిక్ కాకుండా నిరోధించేందుకు బర్నాల్, దూది, అయోడిన్, టించర్, డెట్టాల్ తదితరాలతో కూడిన ఫస్ట్ ఎయిడ్ కిట్ సిద్ధం చేసుకోండి. ప్రాథమిక వైద్యం చేసిన తరువాత కొంత ఉపశమనం పొందినప్పటికీ తప్పక వైద్యుడి వద్దకు వెళ్లి పూర్తి చికిత్స చేయించుకోవడం ముఖ్యం.
- పిల్లల దీపావళి సామగ్రిని కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండటం అత్యంత శ్రేయస్కరం.
- బాంబులను ఎవరు కాల్చినా పసిబిడ్డలు, పిల్లల చెవుల్లో దూది పెట్టడం మరచిపోవద్దు. లేతగా ఉండే వారి కర్ణభేరి చిన్న చిన్న శబ్దాలకు సైతం ఎక్కువగా స్పందిస్తుంది.
- విడి బాంబులు లేదా సీరియల్‌గా ఉండే సీమటపాసులను కొంచెం దూరంగా ఉంచి కాల్చడం మంచిది. వీటిని కాల్చేటప్పుడు వచ్చి పోయే వారిని గమనించండి. అత్యంత ముఖ్యంగా థౌజండ్ వాలా, 10 థౌజండ్ వాలా సీరీస్‌ను కాల్చేటప్పుడు జన సమర్థం లేకుండా చూసుకొని, పక్కవారికి చెప్పి కాల్చండి.

జాగ్రత్తలు తీసుకోవాలి



దుకాణాల నుంచి టపాకాయలను కొనుక్కొని తెచ్చేటప్పుడు బైక్ సైరన్ లకు తగలకుండా జాగ్రత్తగా తీసుకురావాలి. చిన్నపిల్లలకు టపాకాయలు అందకుండా, గ్యాస్ సిలిండర్ దూరంగా ఉంచాలి. కాలిన గాయాలపై బర్నల్ రాయాలి. శరీరాన్ని మంటలు అంటుకుంటే మంటలను ఆర్పి వేసి వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి బాధితుడిని తరలించాలి.

– డాక్టర్ పరుశురాం



పిడుగుపాటుకు ఇద్దరు మృతి

మృతుల్లో ఒకరు కాపరి, మరొకరు బాలుడు


బేతయ్య మృతదేహం


భరత్ (ఫైల్)

టేక్మాల్(మెదక్): పిడుగుపాటుకు గురై కాపరి, విద్యార్థి మృతిచెందారు. ఈ సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం దనూరలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బందారు బేతయ్య(40) గొర్రెలను మేపడంతో పాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డాకూరి శ్రీశైలం కూడా అతని వెంట రోజూ వెళ్తుంటాడు. బుధవారం శ్రీశైలం ఇతర పనులకు వెళ్లాడు. దీంతో కొడుకు డాకూరి భరత్ (14) జీవాలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో బేతయ్య, అతను చెట్టు కిందకు వెళ్లారు. ఇదే సమయంలో ప్రమాదవశాత్తు పిడుగు పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

17 గొర్రెల మృత్యువాత

వట్‌పల్లి(అందోల్): పిడుగుపాటుకు 17 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన అందోల్ మండలం డాకూరు శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన పెద్దగొల్ల వెంకటి, మొగులయ్యలు తమ గొర్రెలను ఎప్పటిలాగే గ్రామ శివారులో మేతకు తోలారు. సాయంత్రం పెద్దగా ఉరుము తర్వాత పిడుగు పడటంతో అక్కడికక్కడే జీవాలు మృతిచెందాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని స్థానికులు కోరారు.


మృతిచెందిన గొర్రెలు